కరీంనగర్ జిల్లా చొప్పదండి వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతు

చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్‌లో తడిసిన వడ్ల సంచులు

కొట్టుకుపోతున్నా కొనరా?

- వడ్ల కొనుగోళ్ల జాప్యంపై రైతుల కన్నెర్ర
- గాలివానలతో తడిసిన ధాన్యం
- కేంద్రాలకు తెచ్చినా సేకరణలో జాప్యం
- తూకం తాత్సారంపై అన్నదాతల ఆందోళన
- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై మండిపాటు
- తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 8: నానా కాష్టాలు పడి పండించిన వడ్లను ఎన్నో ఆశలతో అమ్ముకుందామని తెస్తే కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యంపై రైతుల్లో కోపం కట్టలు తెంచుకుంటున్నది. ధాన్యం తెచ్చి పది, పదిహేను రోజులైనా కొంటలేరని, కాంటా అయిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే నాథుడే లేడని, ఓ దిక్కు గాలి వానలు వచ్చి వడ్లు కొట్టుకుపోతున్నా ఎవరూ పట్టించుకుంటలేరని వారిలో ఆగ్రహం పెల్లుబుకుతున్నది. వడ్ల కొనుగోళ్లపై సర్కారు నిర్లక్ష్యంపై పలుచోట్ల రైతులు రోడ్డెక్కారు. ధాన్యం ఆరబోసి పదిహేను రోజులవుతున్నా కాంటా పెట్టేదిక్కు లేదని నిర్మల్ జిల్లా లక్ష్మణచాందా మండలం చామన్‌పల్లిలో రైతులు బుధవారం నాలుగు గంటలపాటు రాస్తారోకో చేశారు. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి పరిస్థితి చేయిదాటినా అధికారులు స్పందించలేదు. చాలాసేపటికి తహసీల్దార్ జానకి వచ్చి రైతులకు సర్దిచెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి, తిమ్మాపూర్, రామన్నపేట రైతులు చందుర్తి సింగిల్ విండో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. వెంటనే వడ్లు కొనకుంటే కలెక్టర్ ముట్టడిస్తామని హెచ్చరిస్తూ తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు. సంగారెడ్డి జిల్లా హత్నూరా మండలం చింతల్‌చెరులో వడ్లు రైస్‌మిల్లులకు తరలించాలని, లారీలకొరత తీర్చాలని ధర్నాకు దిగారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం జూలూరు, పెద్దగూడెం గ్రామాల రైతులు ప్రధాన రహదారిపై ముళ్ల కంచె వేసి నిరసన తెలిపారు. మూడు రోజులుగా కాంటా వేయడం లేదని, వానలతో ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డగూడూరు మండలం చౌళ్లరామారం, బొడ్డుగూడెం గ్రామాల రైతులు వలిగొండ-తొర్రూరు రోడ్డుపై గంట సేపు ధర్నా చేశారు. అడ్డగూడూరులోని మిల్లులో టార్గెట్ అయిపోవడంతో ధాన్యం తీసుకోవడం లేదని, నేరేడుచర్లకు కేటాయించడంతో ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు.

కొనేదాకా కొట్లాడుదాం : కొప్పుల ఈశ్వర్

పెద్దపల్లిరూరల్/హుస్నాబాద్, మే 8: 'రైతులు అధైర్యపడవద్దు. మీ వెంట బీఆర్ఎస్ ఉంది. కేసీఆర్‌తో పాటు మేమంతా ఉన్నం. కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనేదాకా ప్రభుత్వంతో కొట్లాడుదాం. యాసంగిలో ఎండిన పంటలకు నష్టపరిహారం ఇచ్చేదాకా ఊరుకోం' అని బీఆర్ఎస్ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అభయమిచ్చారు. పెద్దపల్లి నియోజకవర్గంలోని సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్తూ మార్గమధ్యంలో పెద్దబొంకూర్ వద్ద కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం పరిహారం చెల్లించాలని, షరతులు లేకుండా తడిసిన ధాన్యాన్ని కొనాలని డిమాండ్ చేశారు.

కొనుగోళ్లు ఆపితే ధర్నా చేస్తా : ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డి

మెదక్, మే 8 (నమస్తే తెలంగాణ) : పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోతే ధర్నా చేస్తానని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి హెచ్చరించారు. మెదక్ జిల్లా హవేళీ ఘనపూర్ మండలం కూచన్‌పల్లి ఐకేపీ సెంటర్‌ను ఆయన పరిశీలించి రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తేవద్దని ఐకేపీ సిబ్బంది చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడు లారీల ధాన్యం కొనుగోలు చేసి ఒక్క లారీ ధాన్యం పైసలు మాత్రమే ఖాతాల్లో వేశారని సుభాశ్‌రెడ్డి తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఆకాల వర్షం నష్టాన్ని వెంటనే అంచనా వేసి ధాన్యాల పంటలు ఎకరానికి రూ.20వేలు, వాణిజ్య పంటలకు రూ.40వేలు పరిహారం చెల్లించాలని తెలంగాణ రైతు సంఘం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. ఈ వర్షాలకు ఏడుగురు మరణించారని, బాధిత కుటుంబాలకు రూ.5లక్షలు పరిహారం ఇవ్వాలని కోరింది.

ఒక్క వానకే 10 మంది మృతి

భారీ వర్షంతో నగరం ఉక్కిరిబిక్కిరి
సహాయక చర్యల్లో అధికారుల నిర్లక్ష్యం

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఒక్కరోజు కురిసిన వర్షం 10 మంది కార్మికులను బలితీసుకున్నది. హైదరాబాద్‌లో మంగళవారం వర్షం కురుస్తుందన్న ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. దీనికితోడు సహాయక చర్యలు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సైతం సకాలంలో స్పందించలేదన్న విమర్శలున్నాయి. బాచుపల్లిలోని రేజ్ అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలి ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు ప్రమాదం జరిగితే అర్ధరాత్రి 12 గంటలకు సహాయక చర్యలు మొదలయ్యాయి. ఘటనా స్థలానికి వెళ్లేందుకు సరైన దారిలేకపోవడం, విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో పోలీసులే చీకట్లో దారి ఏర్పాటు చేసుకొని స్థానికుల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. మున్సిపల్ అధికారులు, డీఆర్ఎఫ్ విభాగాల నిర్లక్ష్యం ఇక్కడ స్పష్టంగా కనిపించింది. బేగంపేట నాలాలో పడి ఇద్దరు వలస కార్మికులు మృతి చెందారు. బహదూర్‌పురాలో మరో కార్మికుడు కరెంటు స్తంభం తాకడంతో విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. బాచుపల్లి దుర్ఘటనకు నిర్మాణదారు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే కారణమని రంగారెడ్డి జోన్ కార్మికశాఖ జా యింట్ కమిషనర్ చతుర్వేది ఒక ప్రకటనలో తెలిపారు. బాధిత కుటుంబాలకు రూ. 50 వేలు, అంత్యక్రియలకు రూ. 30 వేలు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సర్కారుకు ఉసురు తగులుతది

పదిహేను రోజుల నుంచి రోడ్డుపై వడ్లు ఆరబోస్తున్న. ఇగ కొంటరు, అగ కొంటరని ఎదురు చూస్తున్న. నా దిక్కు చూసేవాళ్లే లేరు. ఇంకా పదిహేను రోజులైనా ఎవరూ వచ్చేటట్టు లేరు. వానలు పడి వడ్లు తడిస్తే అమ్ముడుపోతయే లేదో? వర్షాలకు వడ్లు కొట్టుకుపోతయని భయమైతాంది. రైతులను ఇంత గోస పెడుతున్న ఈ ప్రభుత్వానికి మా ఉసురు తగులుతది.

- ముజ్జిగ లింగయ్య, రైతు, చామన్‌పెల్లి

నెలైనా తూకం వేయలే

చౌటుప్పల్ మార్కెట్‌లో వడ్లు పోసి నెలదాటింది. ఇప్పటికీ తూకం వేయలే. కొనేందుకు టైం పడుతుందని అధికారులు అంటున్నరు. మిల్లుల నుంచి లారీలు రావడం లేదంటున్నరు. హమాలీల కొరత ఉంది. మంగళవారం రాత్రి పడ్డ వానకు వడ్లన్నీ తడిసినయి. మళ్లీ వానలు పడి వడ్లు కొట్టుకపోతే ఎవరు బాధ్యులు. ఇప్పటికైనా ప్రభుత్వం మా బాధను పట్టించుకోవాలె.

-సుర్కంటి మనోహర, శేరిల్ల, చౌటుప్పల్

టైముకు కొంటే తడువకపోవు..

నేను గన్నేరువరం సెంటర్‌కు వడ్లు తెచ్చి 20 రోజులైంది. ఇప్పటికీ వడ్లు జోకలే. నిర్వాహకులను అడిగితే లారీలు లేవు, హమాలీలు లేరని చెబుతున్నరు. గిట్ల లేటుగ జోకడం వల్ల వానకు వడ్లు తడిసినయ్. టైంకు కొంటే ఇంత నష్టం జరిగేది కాదు. మమ్ముల ప్రభుత్వమే ఆదుకోవాలె. తడిసిన ధాన్యాన్ని కొనాలె. కొనకపోతే ఊరుకునేది లేదు.

- బోయిని అంజయ్య, రైతు, గన్నేరువరం, కరీంనగర్ జిల్లా

ఎండితేనే కొనలేదు.. తడిసిన ధాన్యాన్ని కొంటరా ?

ఎండిన ధాన్యాన్నే సకాలంలో కొనుగోలు చేయలేని ప్రభుత్వం ఇప్పుడు తడిసిన ధాన్యాన్ని కొంటామని మొక్కుబడి హామీలిస్తున్నది. ఎన్నికలు దగ్గరపడుతుండడంతో రైతుల ఆగ్రహానికి గురికాకుండా ఉండేందుకు మంత్రులు, అధికారులు రైతులను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆగం చేశాయి. ఎక్కడికక్డ ధాన్యం తడిసిసోయి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఎండిన ధాన్యం రోజుల తరబడి కల్లాల్లో మూలుగుతున్నా కొనుగోలు చేయలేదు. తీరా ఇప్పుడు ధాన్యం తడిసిన తర్వాత ప్రభుత్వం సన్నాయి నొక్కులు నొక్కుతున్నది. వాస్తవానికి వారం ముందే అకాల వర్షాలపై వాతావరణ శాఖ హెచ్చరించింది. కానీ ప్రభుత్వం ఆ హెచ్చరికలను పెడచెవిన పెట్టింది. రైతులకు నష్టం జరుగకుండా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచలేకపోయింది. కానీ వానలతో ధాన్యం తడిసిపోయి రైతులు నష్టపోయాక తీరిగ్గా పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పందించారు. తడిసిన ధాన్యం కొంటామని ప్రకటించారు. కొట్టుకుపోయిన ధాన్యానికి కూడా నష్టాన్ని చెల్లిస్తామని చెప్పుకొచ్చారు. ఒకవేళ మంత్రి ఉత్తమ్‌కు రైతులపై ప్రేమ ఉంటే వర్షం హెచ్చరికలు జారీ చేసినప్పుడే ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఎండిన ధాన్యాన్ని ముందే ఎందుకు కొనలేదనే రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వం కేవలం సుమారు 24 లక్షల టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేసింది.

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	43.8°c	24.7°c
మహబూబ్‌నగర్	43.2°c	30.1°c
నిజామాబాద్	43.6°c	23.7°c
రంగారెడ్డి	42.7°c	20.1°c
మెదక్	40.5°c	21.2°c
నల్లగొండ	39.8°c	29.8°c
ఖమ్మం	39.0°c	28.0°c
వరంగల్	37.0°c	27.0°c
కరీంనగర్	37.0°c	28.0°c
హైదరాబాద్	36.8°c	21.9°c

మరో 5 రోజులు మోస్తరు వర్షాలు

- అకాల వర్షాలతో తగ్గిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా ఆకాల వర్షాలతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. రాష్ట్రంలో మరో 5 రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. మంగళవారం ద్రోణి ప్రభావంతో భారీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారిణి శ్రావణి తెలిపారు. వచ్చే నాలుగు రోజులు వాతావరణం చల్లగా ఉండి, అక్కడక్కడ మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. ఎన్నికలు జరిగే మే 13న కూడా తెలంగాణ, ఏపీలో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. రాబోయే 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల నుంచి కనిష్ఠ ఉష్ణోగ్రతలు 24 డిగ్రీలుగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. బుధవారం రాష్ట్ర వ్యాప్తంగా సగటు గరిష్ఠం 40 డిగ్రీలుగా, కనిష్ఠం 21.9 డిగ్రీలుగా నమోదైనట్లు వెల్లడించింది.

తనయుడితో కలిసి 'బ్రహ్మ ఆనందం'

హాస్యబ్రహ్మ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ కలిసి ఓ సినిమా చేయబోతున్నారు. 'బ్రహ్మ ఆనందం' పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రం ద్వారా ఆర్‌వీఎస్ నిఖిల్ దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాహుల్ యాదవ్ నక్కా నిర్మించనున్నారు. బుధవారం ఈ సినిమా తాలూకు ప్రీలుక్ పోస్టర్‌తో పాటు అనౌన్స్‌మెంట్ వీడియోను విడుదల చేశారు. ఇందులో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్ మధ్య జరిగే సరదా సంభాషణ అందరిని ఆకట్టుకుంటున్నది. ఈ సినిమాలో బ్రహ్మానందం, రాజా గౌతమ్.. తాత, మనవళ్లుగా కనిపించబోతున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను త్వరలో ప్రారంభిస్తామని, డిసెంబర్ 6న విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని నిర్మాత తెలిపారు. వెన్నెల కిషోర్, ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మితేష్ పర్వతనేని, సంగీతం: శాండిల్య పిసపాటి, ఆర్ట్: క్రాంతి ప్రియం, రచన-దర్శకత్వం: ఆర్‌వీఎస్ నిఖిల్.

రాజకీయాలు, రౌడీయిజం ఉండవు

'కెరీర్ ఆరంభం నుంచి కొత్త కథలతో సినిమాలు చేస్తున్నా. రాబోవు చిత్రాల్లో కూడా నా క్యారెక్టర్స్ పూర్తి వైవిధ్యంగా ఉంటాయి. ప్రతీ సినిమాకు పాత్రలపరంగా వేరియేషన్ ఉండేలా చూసుకుంటున్నా' అన్నారు సత్యదేవ్. ఆయన కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం 'కృష్ణమ్మ'. వి.వి.గోపాలకృష్ణ దర్శకుడు. కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి నిర్మించారు. ఈ నెల 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం సత్యదేవ్ పాత్రికేయులతో ముచ్చటిస్తూ 'విజయవాడ నేపథ్యంలో ముగ్గురు మిత్రుల కథ ఇది. వారి స్నేహం, జీవితాల చుట్టూ నడుస్తుంది. కుటుంబాలను గొప్ప స్థాయిలో చూసుకోవాలని కలలు కన్న వారికి కొన్ని అవరోధాలు ఎదురవుతాయి. ఈ క్రమంలో వారు చేసే పోరాటం ఆసక్తికరంగా ఉంటుంది. విజయవాడ అంటే పాలిటిక్స్ అనుకుంటారు. కానీ ఇందులో రాజకీయాలు, రౌడీయిజం వంటి అంశాలుండవు. కథలో సహజత్వం కనిపించాలని విజయవాడలో అరవై రోజుల పాటు చిత్రీకరణ చేశాం' అన్నారు. ఈ సినిమాలో తాను వించిపేటకు చెందిన భద్ర అనే యువకుడి పాత్రలో కనిపిస్తానని, ప్రతీకారంతో రగిలిపోయే వ్యక్తిగా తన పాత్ర భిన్న కోణాల్లో సాగుతుందని సత్యదేవ్ తెలిపారు. నాయగన్, ఆపద్భాందవుడు వంటి సినిమాలు చేయాలన్నది తన డ్రీమ్ అని, భవిష్యత్తులో ఆ తరహా క్యారెక్టర్స్ కోసం ఎదురుచూస్తున్నానని ఆయన చెప్పారు.

చిత్రం

బుజ్జమ్మ మాట ముచ్చట

సాయిపల్లవి సినిమా అంటే అందులో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని ప్రేక్షకులు భావిస్తారు. కథల ఎంపికలో చాలా ఆమె చాలా సెలెక్టివ్‌గా ఉంటుందని చెబుతారు. కెరీర్ ఆరంభం నుంచి ప్రతీ చిత్రంలో తనదైన మార్క్ చూపిస్తూ విలక్షణ నాయికగా గుర్తింపును తెచ్చుకుందీ తమిళ సోయగం. నేడు సాయిపల్లవి జన్మదినం. ఈ సందర్భంగా నాగచైతన్యతో కలిసి ఆమె నటిస్తున్న 'తండేల్' చిత్రం నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఇందులో సాయిపల్లవి చిరునవ్వులు చిందిస్తూ కనిపిస్తున్నది. గ్రామీణ నేపథ్యంలో దేశభక్తి ప్రధాన అంశాలతో దర్శకుడు చందు మొండేటి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. నాగచైతన్య జాలరి రాజు పాత్రలో నటిస్తుండగా, సాయిపల్లవి ఆయన భార్య బుజ్జమ్మగా కనిపించనుంది. అనూహ్య పరిస్థితుల్లో పాకిస్తాన్ సైన్యం చేతిలో బందీ కాబడ్డ భారత జాలరులు అక్కడి నుంచి ఎలా బయట పడ్డారు? దేశభక్తిని గుండెల్లో నింపుకున్న ఆ మత్స్యకారుల బృందం చేసిన సాహసాలేమిటన్నదే ఈ చిత్ర కథాంశం. నేడు సాయిపల్లవికి చెందిన స్పెషల్ వీడియోను కూడా చిత్ర బృందం విడుదల చేయనుంది. ఈ చిత్రానికి కెమెరా: షామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, నిర్మాణ సంస్థ: గీతా ఆర్ట్స్, సమర్పణ: అల్లు అరవింద్, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.

కాస్త ఆలస్యంగా 'గేమ్‌ఛేంజర్'?



రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న పొలిటికల్ యాక్షన్ డ్రామా 'గేమ్ ఛేంజర్'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు నిర్మిస్తున్నారు. కియారా అద్వాణీ కథానాయిక. ప్రస్తుతం తుదిదశ చిత్రీకరణలో ఉంది. ఈ సినిమాను అక్టోబర్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా విడుదల కాస్త ఆలస్యం అయ్యే అవకాశం ఉందని తెలుస్తున్నది. దర్శకుడు శంకర్ 'గేమ్ ఛేంజర్'తో పాటు కమల్‌హాసన్ 'ఇండియన్-2' చిత్రాన్ని కూడా పూర్తి చేసే పనిలో ఉన్నారు. దీంతో ఆయన 'గేమ్‌ఛేంజర్' చిత్రం కోసం పూర్తి సమయాన్ని వెచ్చించలేకపోతున్నారని, ఈ కారణంగా షూటింగ్ కూడా ఆలస్యమవుతున్నదని చెన్నై సినీ వర్గాల టాక్. ఈ నేపథ్యంలో 'గేమ్ ఛేంజర్' రిలీజ్ ఎప్పుడు ఉంటుందోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ విషయంలో స్పష్టత రావాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందేనని అంటున్నారు. సమకాలీన రాజకీయాంశాలను చర్చిస్తూ దర్శకుడు శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో తండ్రీకొడుకులుగా రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. కియారా అద్వాణీ, అంజలి, సముద్రఖని, ఎస్.జె.సూర్య, శ్రీకాంత్, సునీల్, నవీన్‌చంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఎస్.తిరుణావుక్కరసు, సంగీతం: తమన్, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, నిర్మాతలు: దిల్‌రాజు-శిరీష్, దర్శకత్వం: శంకర్.

'కేజీఎఫ్-3'కి స్క్రిప్ట్ సిద్ధం

'కేజీఎఫ్' సిరీస్ సినిమాలతో పాటు 'సలార్' చిత్రంతో దేశవ్యాప్తంగా పాపులారిటీ సంపాదించుకున్నారు దర్శకుడు ప్రశాంత్‌నీల్. ప్రస్తుతం ఆయన 'సలార్' సీక్వెల్ 'శౌర్యంగపర్వం' షూటింగ్ కోసం సన్నద్ధమవుతున్నారు. ఈ నెలలోనే ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది. ఇదిలావుండగా 'కేజీఎఫ్' సిరీస్‌లో వచ్చిన రెండు చిత్రాలకు పాన్ ఇండియా స్థాయిలో అపూర్వ ఆదరణ దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌లో మూడో సినిమా కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. తాజా ఇంటర్వ్యూలో 'కేజీఎఫ్-3'కి సంబంధించి అప్‌డేట్‌ను అందించారు దర్శకుడు ప్రశాంత్‌నీల్. ఈ సినిమా స్క్రిప్ట్ సిద్ధంగా ఉందని, హీరో యష్ ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉన్నందున ఆయన డేట్స్ కోసం ఎదురుచూస్తున్నానని తెలిపారు. 'ప్రస్తుతం 'శౌర్యంగపర్వం' మీదనే దృష్టి పెట్టాను. ఈ సినిమా పూర్తయిన తర్వాతే 'కేజీఎఫ్-3' పట్టాలెక్కుతుంది' అని ప్రశాంత్‌నీల్ చెప్పారు. హీరో యష్ ప్రస్తుతం 'టాక్సిక్' అనే చిత్రంలో నటిస్తున్నారు. 'రామాయణ'లో రావణాసురుడి పాత్రలో కనిపించనున్నారు. ఈ రెండు చిత్రాలు పూర్తయిన తర్వాతే ఆయన 'కేజీఎఫ్-3' సెట్స్‌లో అడుగుపెడతారని సమాచారం.

పెళ్లి ఫొటోలు డిలీట్!

బాలీవుడ్ అగ్ర హీరో రణ్‌వీర్‌సింగ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి పెళ్లి ఫొటోలను మొత్తం డిలీట్ చేశారు. 2023కు ముందున్న ఫొటోలన్నీ తీసివేయడంతో అభిమానులు ఒక్కసారిగా విస్మయానికి గురయ్యారు. రణ్‌వీర్‌సింగ్-దీపికా పదుకొణె జంట విడిపోతున్నారంటూ గత కొంతకాలంగా బాలీవుడ్‌లో పుకార్లు వినిపిస్తున్నాయి. అయితే ఈ వార్తలను దీపికా పదుకొణే ఓ ఇంటర్వ్యూలో ఖండించింది. తమ మధ్య ఎలాంటి అభిప్రాయ భేదాలు లేవని, ఇద్దరం అన్యోన్యంగా ఉంటున్నామని తెలిపింది. తాజాగా రణ్‌వీర్ సింగ్ ఫొటోలు డిలీట్ చేసిన సంఘటనతో వీరి బంధంపై అనుమానాలు మొదలయ్యాయి. అయితే రణ్‌వీర్‌సింగ్ ఫొటోలను కావాలని తొలగించలేదని, ఏదైనా సాంకేతిక లోపం కారణంగా అలా జరిగి ఉండొచ్చని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయంలో రణ్‌వీర్‌సింగ్ స్పందిస్తేనే స్పష్టత వస్తుందంటున్నారు. రణ్‌వీర్‌సింగ్-దీపికా పదుకొణే జంట 2018లో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. సెప్టెంబర్‌లో వీళ్లు తల్లిదండ్రులు కాబోతున్నారు. ఈ నేపథ్యంలో రణ్‌వీర్‌సింగ్ తన ఇన్‌స్టా ఖాతా నుంచి పెళ్లి ఫొటోలను డిలీట్ చేయడం అభిమానులను కలవరపరుస్తున్నది. ప్రస్తుతం దీపికా పదుకొణే తెలుగులో 'కల్కి 2898 ఏడీ' చిత్రంలో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

విభిన్న ప్రేమకథ 'వృషభ'

జీవన్ రెడ్డి, అలేఖ్య జంటగా నటిస్తున్న చిత్రం 'వృషభ'. అశ్విన్ కామరాజ్ కొప్పాల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఉమాశంకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. బుధవారం ఈ చిత్ర ట్రైలర్, లిరికల్ వీడియోను విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక విభిన్నమైన ప్రేమకథ. నాలుగేళ్ల పాటు స్క్రిప్ట్‌పై వర్క్ చేశాం. ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు. చిత్రీకరణ తుదిదశలో ఉందని, ఈ సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలో వెల్లడిస్తామని నిర్మాత ఉమాశంకర్ రెడ్డి తెలిపారు. ట్రైలర్ చూడగానే ఓ డిఫరెంట్ సబ్జెక్ట్ అనే భావన కలిగిందని కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన దర్శకుడు సముద్ర పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: యు.ఎస్.విజయ్, సంగీతం: ఎమ్.ఎల్.రాజా, సహనిర్మాత: మల్లికా రెడ్డి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అశ్విన్ కామరాజ్ కొప్పాల.

ఇష్టం వచ్చినట్లు రాస్తారా!

బాలీవుడ్ అగ్ర కథానాయిక జాన్వీకపూర్ వివాహం గురించి ఓ నెటిజన్ పెట్టిన పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'జాన్వీకపూర్ తిరుపతిలో పెళ్లి చేసుకోబోతున్నది. అందుకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. ఈ విషయాన్ని ఆమె స్వయంగా చెప్పింది' అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వ్యక్తి పోస్ట్ చేశారు. దీనిపై జాన్వీకపూర్ కాస్త సీరియస్‌గానే రియాక్ట్ అయ్యింది. 'మీ ఇష్టం వచ్చినట్లు ఏదైనా రాస్తారా' అంటూ స్పందించింది. దీంతో ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లోకి వచ్చింది. మహారాష్ట్ర రాజకీయ కుటుంబానికి చెందిన శిఖర్ పహారియాతో జాన్వీకపూర్ గత కొంతకాలంగా డేటింగ్‌లో ఉందని ప్రచారం జరుగుతున్నది. పలు ఇంటర్వ్యూల్లో శిఖర్ గురించి జాన్వీకపూర్ గొప్పగా మాట్లాడింది. ఇటీవల ఓ ఈవెంట్‌కు 'శిఖు' అనే లోగో ఉన్న నెక్లెస్‌ను ధరించి వచ్చింది. దీంతో ఈ జంట పెళ్లిపీటలెక్కబోతున్నారని బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. 'దేవర' చిత్రంలో జాన్వీకపూర్ టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్నది. ఈ చిత్రం అక్టోబర్‌లో విడుదలకానుంది.